క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: సింగపూర్ టౌన్‌షిప్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్ల కింద చెట్ల కొమ్మలు నరికివేస్తున్నందున బుధవారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సతీష్ కుమార్ తెలిపారు. సింగపూర్ టౌన్‌షిప్ ప్రాంతంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి గ్రామం, అయ్యప్పనగర్ మెయిన్‌రోడ్డు ప్రధాన చౌరస్తాలో మంగళవారం శివపార్వతి గ్రూప్ ఆధ్వర్యంలో బద్దం శ్రీనివాస్‌రెడ్డి(కన్ని) జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ, చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శివపార్వతి గ్రూప్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న డీఎం

మేడ్చల్: మేడ్చల్ డిపోలో పని చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు డీఎం సుధాకర్ మజ్జిగ పంపిణీ చేశారు. ఎండ వేడిమి నుండి కార్మికులు ఉపశమనం పొందేందుకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం రామారావు, కార్మికులు పాల్గొన్నారు.

కోళ్లకు వ్యాక్సినేషన్



కోళ్లకు టీకాలు వేస్తున్న దృశ్యం

మేడ్చల్‌రూరల్: వేసవిలో వచ్చే తెగుళ్ల, వ్యాధుల పట్ల కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని మునీరాబాద్ గ్రామ సర్పంచ్ గణేశ్, పశువైద్యాధికారులు అన్నారు. మంగళవారం గ్రామంలో పెరటి కోళ్లలో కొక్కెర తెగులు నివారణ టీకాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో పశువైద్యులు కురుమూర్తి, నవీన, సుధ, గణేశ్, తిరుపతి, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు



బోల్తా పడ్డ ట్రాలీ ఆటో

ఘట్‌కేసర్: పెయింట్ బాక్స్‌లతో వెళుతున్న ట్రాలీ టైర్ పేలడంతో బోల్తా పడిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జగద్గిరిగుట్టకు చెందిన చంద్రశేఖర్ కూకట్‌పల్లి నుంచి ట్రాలీ ఆటోలో పెయింట్ బాక్స్‌లు లోడ్ చేసుకుని భువనగిరికి బయల్దేరాడు. ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ సమీపంలో ఆటో టైర్ పేలడంతో వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన డ్రైవర్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



కుమ్మరి బస్తీ పాదయాత్రలో శ్రీధర్

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర 25వ రోజుకు చేరుకుంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ మంగళవారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ముస్లింబస్తీ, కుమ్మరి బస్తీ, నర్సింహరెడ్డి నగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. తెలంగాణ నినాదం, వాదంతో గద్దెనెక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారని, ప్రభుత్వ పాలన మేడి పండు చందం అన్న మాదిరిగా ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సింగరావు, పోల్కం వెంకటేష్, గుత్తి చందర్, రాములు, అలీ, విఠల్, నరహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాకు ఓటేస్తే.. కుటుంబమంతా పని చేస్తున్నాం

కార్యకర్తలతో గ్యాప్ వచ్చింది.. ఇకపై రానివ్వను

- మోసం చేసే కుటుంబం కాదు.. సేవ చేసే కుటుంబం
- మేడ్చల్ పట్టణ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: కార్యకర్తలకు తనకు మధ్య గతంలో కొంత దూరం పెరిగిందని ఇకపై అలాంటి సమస్య లేకుండా చూస్తానని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం శ్రీగార్డెన్‌లో నిర్వహించిన పట్టణ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో కార్యకర్తలకు తనకు కొంచెం దూరం పెరిగిన మాట వాస్తవమని ఇకపై నిత్యం కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ వారికి తగు ప్రాధాన్యం ఇస్తానని అన్నారు.

మోసం చేసే కుటుంబం కాదు..

తనది మోసం చేసే కుటుంబం కాదని ప్రజలకు సేవ చేసే కుటుంబమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. తనకు భగవంతుడు ఆర్థిక స్థోమత ఇచ్చాడని ప్రజలకు సేవ చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు తనకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే సీఎం అండదండలతో మంత్రినయ్యాయని మేడ్చల్ ప్రజల రుణం తీర్చుకోవడానికి తన కుటుంబమంతా కలిసి ప్రజలకు సేవ చేస్తుందన్నారు. తన ఇద్దరు కుమారులు మహేందర్ రెడ్డి, భద్రారెడ్డి, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి వ్యాపారాలకు పరిమితం కాకుండా నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. తన ఇద్దరు కుమారులు పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తల్లా పని చేస్తున్నారన్నారు.

- కౌన్సిలర్లు తమ పదవుల్లోకి రాగానే వారి వెంట కరోనా కూడా వచ్చిందన్నారు. కరోనా కారణంగా రెండేళ్లు ఇబ్బందులు పడ్డారని ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేవని కష్టపడి పని చేస్తున్నారన్నారు.

మహిళలకు ప్రాధాన్యం

మహిళలకు ప్రభుత్వ పథకాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద పీట వేస్తున్నారని తాను కూడా వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మంత్రి తన ప్రసంగంలో మహిళలను ఒక్కసారిగా ఆకాశానికి ఎత్తేశారు. వారితో కలిసి భోజనాలు చేసి ఫొటోలు దిగారు.

టికెట్ ఎవరికి ఇచ్చినా గెలిపిస్తాం: సుధీర్‌రెడ్డి

రాబోయే ఎన్నికల్లో పార్టీ అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం పని చేస్తామని కార్యకర్తలు పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలని రాష్ట్ర బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సంవత్సరం కావడంతో కార్యకర్తలు చురుగ్గా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ వాణిదేవి, పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు నందారెడ్డి, దీపిక, శేఖర్‌గౌడ్, విష్ణుచారి, కౌన్సిలర్లు, వార్డుల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మహిళతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి



హాజరైన నాయకులు, కార్యకర్తలు

వైభవంగా శ్రీ కురుమారియమ్మ బోనాలు

కీసర: కీసర గ్రామంలో స్థిరపడిన తమిళులు కీసరగుట్ట రోడ్డులోని శ్రీ కరుమారియమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు కీసర గ్రామ కాంగ్రెస్ నేత రామిడి విజయ్ స్వప్న రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. టీపీసీసీ సీనియర్‌నేత సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్‌గౌడ్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ మాధురి వెంకటేష్, ఉపసర్పంచ్ లక్ష్మన్, వార్డుసభ్యులు, వివిధ పార్టీల నేతలు, తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

పకడ్బందీగా 'ఆరోగ్య మహిళ' పథకం

వైద్యాధికారులకు డీఎంహెచ్ఓ శ్రీనివాస్ సూచన

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఆరోగ్య మహిళా పథకంతో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల్లో ప్రతి మంగళవారం ప్రత్యేకంగా 57 ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మహిళలు ఎదుర్కొనే అనేక రకాల ఆరోగ్య సమస్యలకు వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల వైద్యులతో ఆయన జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు, ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ల స్క్రీనింగ్, థైరాయిడ్, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించడం, అయోడిన్ సమస్య, ఫోలిక్ యాసిడ్, ఐరన్ లోపంతోపాటు విటమిన్ బీ12, విటమిన్ డీ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయాలన్నారు. మూత్ర కోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, పెల్విక్ ఈ ఫ్లమేటరీ వ్యాధుల పరీక్షలు, మెనోపాజ్ దశకు సంబంధించి పరీక్షలు చేసి, అవసరమైన వారికి హార్మోన్ రీ ప్లేస్మెంట్ థెరపీ చేయడంతోపాటు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. సంతాన సమస్యలపై ప్రత్యేకంగా పరీక్షలు చేసి, వైద్యంతోపాటు అవగాహన కల్పించటంతోపాటు అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు చేయాలన్నారు. బరువు నియంత్రణ, యోగా, వ్యాయామంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ దవాఖానాల్లో కాన్పుల సంఖ్య పెంచటం, టెలీకన్సల్టేషన్ సేవలు , ప్రతి ఆరోగ్య కేంద్రం వద్ద యాంటీ రేబిస్ వ్యాక్సిన్, యాంటీ స్నేక్ వెనమ్ స్టాక్‌లను సిద్ధంగా ఉంచుకోవాలి డీఎంహెచ్ఓ ఆదేశించారు .



జేఎన్ఎంయూఆర్ కాలనీకి బస్సు నడపండి

కీసర : రాంపల్లి దాయర గ్రామ పంచాయతీపరిధిలోని జెఎన్ఎంయూఆర్ కాలనీకి సికింద్రాబాద్ నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ మంగళవారం గ్రామ సర్పంచ్ గరుగుల అండాలు మల్లేష్ ఉప్పల్ డిపో ఆర్టీసీ మేనేజర్ మురళీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జేఎన్ఎంయూఆర్‌కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలు సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారని ఉదయం 5గంటల సయమంలో , తిరిగి సాయంత్రం 4 గంటలకు కాలనీకి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ప్రజలు మున్సిపాలిటీకి సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి పాటుపడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, కమిషనర్ స్వామి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ఏప్రిల్ నెలాఖరులోగా ఇంటి పన్నులు చెల్లించే ప్రజలకు 5 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సీఎం రిలీఫ్ చెక్కు అందజేత

బోడుప్పల్: 6వ డివిజన్ పరిధిలో నివసించే యాదిరెడ్డి అనారోగ్యంతో హాస్పిటల్‌లో చేరగా ఆయనకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మేయర్ సామల బుచ్చిరెడ్డి అందజేశారు. మంగళవారం ఆయన కుటుంబ సభ్యులకు రూ.1.55 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

మంత్రి సబితతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లాలో పదో తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఉన్నత అధికారులతో కలిసి 10వ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సలహాలు, సూచనలను అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో 44013 విద్యార్థులకుగాను 220 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు అదనపు కలెక్టర్లు, ఆడీఓలు,నిత్యం పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తూ ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రతి కేంద్రం వద్ద ఒక పురుష, ఒక మహిళా కానిస్టేబుల్‌ను నియమించామన్నారు. పరీక్ష విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మంత్రికి వివరించారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ ఫోన్ నంబరు 040–35659758 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 10వ తరగతి పరీక్షల్లో ప్రశ్నా పత్రాల లీకేజీ సంఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తూ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రా రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ కావ్య

జవహర్‌నగర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య అన్నారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని వీఆర్ఏ కార్యాలయంలో 22వ డివిజన్ కార్పొరేటర్ బింగి లావణ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మేయర్ మేకల కావ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాంచందర్, కో–ఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజీజ్, స్వేచ్ఛావేదిక సొసైటీ డైరెక్టర్ రాజుయాదవ్, ఏఎన్ఎంలు, మున్సిపల్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌లో అజురా 2కే 23



అజురా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూహెచ్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు ఆకాశమే హద్దుగా భావించి ముందుకు సాగాలని జేఎన్‌టీయూహెచ్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి స్టూడెంట్స్ సింపోసిస్ అజురా 2కె 23 ని ప్రారంభించి విద్యార్థుల స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పేపర్ ప్రజెంటేషన్, మోడల్ ఎగ్జిబిషన్ తో పాటు పలు పోటీలు నిర్వహించారు. అనంతరం సమావేశంలో విద్యార్థుల నుద్దేశించి వారు ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, దేవదాస్, విజయ్‌కుమార్, నాగరాజునాయక్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రోహిణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవ చేయడంలోనే ఆనందం



ఆర్థిక సహాయం అందజేస్తున్న సీఐ సీతారాం, ఎస్ఐ అనిల్, జర్నలిస్టులు

జవహర్‌నగర్: సేవ చేయడంలోనే ఎంతో ఆనందం ఉంటుందని జవహర్‌నగర్ సీఐ సీతారాం అన్నారు జవహర్‌నగర్ కార్పొరేషన్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో మంగళవారం వికలాంగుల కాలనీకి చెందిన దివ్యాంగులు సుమలత, రాజు కుటుంబానికి ఉపాధి కోసం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జవహర్‌నగర్ సీఐ సీతారాం, ఎస్ఐ అనిల్‌కుమార్ వారికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సేవ చేయడంలో ఎంతో ఆనందం ఉందన్నారు. జర్నలిస్టులు దివ్యాంగుల కుటుంబానికి ఉపాధి కల్పిస్తూ వారికి అండగా నిలవడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బూడిద వెంకటేష్, బాషపల్లి రమేష్‌చారి, దివ్యాంగులు, కాలనీవాసులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును ఎత్తి వేయండి



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న వైఎస్ఆర్‌టీపీ నేతలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని వైఎస్ఆర్‌టీపీ మేడ్చల్ నియోజకవర్గం కో–ఆర్డినేటర్ పాకాల డానియేల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టరేట్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డు వల్ల సమీపంలోని కాప్రా, కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌టీపీ నాయకులు వడ్డెపల్లి యాదిరెడ్డి, తాడికొండ అశోక్, నర్సింహారెడ్డి, కోళ్ల మల్లేష్‌యాదవ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేయండి

అల్వాల్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టు కాంప్లెక్స్ బార్ అసోషియేషన్ నూతన కమిటీ ప్రతినిధులు మంగళవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోర్టు బిల్డింగ్ నిర్మాణానికి ఎదురవుతున్న అడ్డంకులను కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలో సీఎంను కలిసి పరిస్థితులను వివరిస్తానని, తన శక్తి మేరకు బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మ కిరీట్‌రెడ్డి, కార్యదర్శి రాజుయాదవ్, సంయుక్త కార్యదర్శి బాపిరెడ్డి, మాజీ అధ్యక్షులు యాదగిరిరావు, అబ్బా రమేష్, లక్ష్మీనర్సయ్య, కొంపల్లి మున్సిపాలిటీ స్టాండింగ్ కమిటీ సభ్యులు సీహెచ్ కృష్ణ, పెంచల సురేందర్‌రావు, సీనియర్ న్యాయవాదులు లక్ష్మీనరసింహం తదితరులు ఉన్నారు.



వాల్ పోస్టర్ విడుదల

మేడ్చల్: నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఈనెల 8న బీజేపీ నిర్వహించనున్న బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను మంగళవారం మండల నాయకులు విడుదల చేశారు. ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా

- గుండ్లపోచంపల్లిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న పాలకవర్గం, అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ షెటర్లు వేసి దృశ్యం



అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్డు

మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ ఓ వైపు గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, మరోవైపు అపార్ట్‌మెంట్లతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అయితే ఈ మున్సిపాలిటీలో అదే స్థాయిలో అక్రమ నిర్మాణాలు సైతం జోరుగా సాగుతున్నాయి. కొందరు రెసిడెన్షియల్ పర్మిషన్లు తీసుకుని కమర్షియల్ నిర్మాణాలు చేపడుతుండగా మరికొందరు ఏ అనుమతులు లేకుండానే అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. పాలకవర్గ సభ్యులు నిర్మాణదారులు తమకు అక్కరకు వస్తారనో లేక ముడుపులు ఇస్తారనో వీటిని ప్రోత్సహిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపాల్సిన అధికార యంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి తూతూ మంత్రంగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటోంది.

రెసిడెన్షియల్ అనుమతులు.. కమర్షియల్ నిర్మాణాలు...

మున్సిపాలిటీ పరిధిలో పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. నివాసం ఉండేందుకు కొందరు నిర్మాణాలు చేపడుతుండగా వ్యాపారం సాగించేందుకు మరికొందరు భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. మున్సిపాలిటీలో కమర్షియల్ భవన నిర్మాణం చేపట్టాలంటే హెచ్ఎండీఏ నిబంధనలు పాటించడంతో పాటు రూ.లక్షల్లో ప్రభుత్వానికి చలాన్ కట్టాల్సి ఉంటుంది. రెసిడెన్సియల్ నిర్మాణానికి మున్సిపాలిటీ లో అనుమతులు లభిస్తుండడం, రూ.వేలల్లోనే ఖర్చు అవుతుండడంతో నిర్మాణదారులు రెసిడెన్సియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్‌గా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వ భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

జోరుగా అక్రమ నిర్మాణాలు..

అక్రమ నిర్మాణాలు సైతం జోరుగానే సాగుతున్నాయి. గుండ్లపోచంపల్లి, మైసమ్మగూడలో ఎలాంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల అండతోనే ఈ నిర్మాణాలు సాగుతున్నాయని మున్సిపల్ అధికారులు సైతం వాటిని అరికట్టడంలో అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నోటీసులు జారీ చేశాం



మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికి అనుమతులు లేని నిర్మాణాలకు, రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు జారీ చేసి పనులను నిలిపివేయించాము. నిబంధలు పాటించకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు.

–రాములు, మున్సిపల్ కమిషనర్, గుండ్లపోచంపల్లి